


# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



### నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

## సరోజ చేసిన నేరం?

**అసలు సరోజ** ఏం నేరం చేసిందని అంత శిక్ష? కమలాకరుడు అన్ని కష్టాలు పెట్టాలా?

పుట్టింట్లో అబ్బరంగా పెరగడం తప్పా? అలా పెరిగిన పిల్ల, పొద్దుటే నిద్రలేవగానే "అమ్మా కాఫీ" అనడం తప్పా? నేరమా? ద్రోహమా? అన్యాయమా? తన తల్లినేగా అడిగిందీ? పక్కింటి ఆవిడనో ఇంకెవరినో కాదుగా? అడగందే అమ్మయినా పెట్టదు అంటారే? కాఫీ అడగకపోతే ఇస్తారా? పొద్దున్నే కాఫీ తాగకపోతే తలనెప్పి రాదూ. ఎవరీ సరోజ? ఏమా కాఫీ వృత్తాంతం? అంటారా? సరోజ తెలీని తెలుగువాళ్ళుంటారా?

మా చిన్నప్పుడు, నాకు కాస్త పెంకితనం ఎక్కువ. "ఆ గారాబం ఏవిటే, మూతి ముందుకి పెట్టి గుండమ్మ కూతురు సరోజలా?" అనేది మా అమ్మమ్మ. అంతలా ఇంటింటా సరోజని పెంకిపిల్ల మాటకి ప్రత్యామ్నాయంగా వాడాలా అండీ? మధ్యన కమలాకరుడు కష్టాలు పెట్టాలా? అన్నావేంటీ? అంటారా? అదేనండీ గుండమ్మకథ డైరెక్టర్ కమలాకర కామేశ్వరరావుగారు. దేవుళ్ళ సినిమాలు తీసి, జనం అంతా కొబ్బరి కాయలు కొట్టేలా థియేటర్ల ముందు, చేసే ఆయన సాంఘిక సినిమా తీసి, ఒక స్త్రీ పేరుతో ఆవిడ కథ అని చెప్పి, సరోజని సినిమా నిడివంతా కష్టాలు పెడ్తారా? సాంఘిక సినిమా అంటే సంఘానికి సంబంధించిన సినిమా అనేగా. సంఘానికి ఏం మెసేజ్ ఇద్దామనుకున్నారు. ఆడపిల్ల పొద్దున్నే లేచి కాఫీ అడగడం తప్పనా? ఆ సాంఘిక సినిమా కథ మొత్తం, గయ్యాళి అయిన గుండమ్మకి బుద్ధొచ్చేట్లు చెయ్యడం. ఆమెకి బుద్ధి వచ్చి సవితి కూతురు లక్ష్మిని ప్రేమగా చూసేట్లు చెయ్యాలంటే, ఫోటోలో వున్న చచ్చి పైలోకాలకి వెళ్ళిన మొగుడుగారు, ఆయన ఆత్మా, కలిసి ఆ ఇంటికి పెళ్ళి సంబంధం కోసం ఎస్.వి.రంగారావుగారిని పంపారా? వచ్చినప్పుడు సరోజ "అమ్మా కాఫీ" అని నిద్రలేచి అడగడం విన్నారే అనుకోండీ? వెంటనే ఆ పిల్ల గుణగణాలని జడ్జ్ చేసేస్తారా? Dont judge a book by its cover?

ఆ తర్వాత 23 రీళ్ళ సినిమా అంతా సరోజని మార్చడానికి నాగేశ్వరరావు ఆమెని ప్రేమించినట్లు నటించి, పెళ్ళి చేసుకుని, మొదటి రాత్రే దొంగ అనీ, తాగుబోతనీ తెలిసేట్లు చేసి అమాయకమైన సరోజ కన్నె మనసు ముక్కలు ముక్కలు

చెయ్యాలా? ఆ మొదటి సీన్‌లో తప్ప సరోజ ఏమీ తప్పు చెయ్యలేదే? ( ఓ వేళ కాఫీ అడగడం .. అదీ అమ్మని అడగడం మీ దృష్టిలో నేరం అయితే యువరానర్!)

ఇంకో సీన్లో "అమ్మా! అక్కయ్యకి చీరలు కొనడానికి బజారు వెళ్తున్నాను" అంటుంది తల్లితో.

సవితి అక్కగారైన సావిత్రికి చీరలు కొనడానికి వెళ్ళే సరోజ చెడ్డపిల్లా? మంచి పిల్లా? అలాంటి బంగారం వంటి బుద్ధున్న పిల్లని, మొగుడు వదిలేసి పారిపోయాడని నాటకాలాడించి, ఛాయాదేవి చేత అంతమాట అనిపిస్తారా?" మొగుడు చచ్చి నేనూ..వుండి నీ కూతురు ఒక్కలా వున్నాం" అని. సరోజ పసి మనసు ఎంత గాయపడిదండీ?

ఆ ఈటెల్లాంటి లోకం మాటలు భరించలేక తాగుబోతు అయినా, దొంగ అయినా, అతని తోడిదే లోకం.. అనుకంటూ, భర్త వెంట సరోజ వెళ్ళిపోయింది. అదే పౌరాణిక సినిమాలో హీరోయిన్ ఈ పని చేసుంటే, ఏ పార్వతీదేవో ప్రత్యక్షం అయి సరోజ చేత శుక్రవారం నోములాంటిది చేయించి, వరాలిచ్చినట్లు చూపించేవారీ కమలాకర కామేశ్వరరావుగారు. కానీ ఇక్కడ గుండమ్మకి బుద్ధి చెప్పాలి, భర్త పోయాక సవితి కూతుర్ని పనిమనిషిలా మార్చి, ఆమెకి సంబంధాలొచ్చినా తిరగ్గొట్టి, ఇంట్లో బండరాముడిలాంటి పనివాడు ఎన్.టి.ఆర్‌ని ఇచ్చి పెళ్ళి చేసి ఇల్లరికం వుంచెయ్యాలి అనుకున్నందుకు గుండమ్మకి బుద్ధి రావాలంటే, ఆమె ప్రాణం సరోజ. రాక్షసుడి ప్రాణాలు చిలకలో వున్నట్లు .... సరోజని కష్టాలు పెడితే గుండమ్మకి బుద్ధొస్తుంది అని వారి నమ్మకం.

గుండమ్మ చెడ్డదైనంత మత్రాన సరోజ చెడుదవ్వాలా పాపం. తోట బంగళా వెనకున్న పూరి గుడిసెలో కూడా భర్తతో కిల కిలా నవ్వుతూ వుండే పాపం? ప్రేమ యాత్రలకు బృందావనమూ.. నందనవనాలు ఏలనో?" అని అతగాడు అంటే, నీ పిసినారితనం కూలా... హనీమూన్ కూడా ఈ పూరింట్లోనేనా? అనుకుండా చాలా అణుకువగా "తీర్థయాత్రలకి రామేశ్వరము ....కాశీ ప్రయాగలేలనో? ప్రేమించిన పతి చెంతనుండగా వేరే తీర్థాలు ఏలనో?" అంటూ 'అహహా....ఒహో.. అహహా" అంటూ అతని పాదాలు కళ్ళకి అద్దుకుని, మంగళ సూత్రాలకి దణ్ణం పెట్టుకున్న మహా సాధ్వి సరోజ.

వంట రాకపోయినా, వేళ్ళు తెగేట్లు కత్తిపీటతో కూరలు తరిగి, ఉప్పు కషం కూరలు చేసి, అపురూపంగా పెరిగిన పిల్ల అష్టకష్టాలు పడింది. అంతటితో మారింది లెమ్మని ఊరుకున్నారా? ఉహూ! మొగుడు ఆమె ఒళ్ళో పడుకుని, అదే ఊటీ. కొడైకెనాల్‌లా ఊహించుకుని, మురిసిపోతున్న అమాయకురాలిని ఓ కోరిక కోరాడు. "గారెలు తినాలనుందని". గారెలు తినాలని వుంటే, మగాడు వెళ్ళి నాలుగు వెచ్చాలు కొని తేవాలి కానీ "వెళ్ళి జమిందారు గారిని అడిగి డబ్బులు తే" అంటాడా? అంటే మాత్రం" నాకేం తెలుసు? పని చేసేది నువ్వు. నువ్వే వెళ్ళు" అనకుండా, అమాయకపు మేకలా సరోజ బుర్ర ఊపుకుంటూ, పతి కోరిక తీర్చడమే తన తక్షణ కర్తవ్యం అని వెళ్ళింది . సరోజకి వెళ్ళాక అక్కడ నౌకరు, ఈరోజు పనిమనిషి రాలేదు, బాబుగారు కాస్త అంట్లు గిన్నెలు తోమెయ్యమన్నారని" చెపితే, బావి చుట్టూ, ఓ పదహారిళ్ళలోని గిన్నెలు, గంగాళాలూ, గోకర్ణాలూ, పెళ్ళిళ్ళలో వాడే బాండీలూ లాంటిది. బావి పళ్ళెం కనపడకుండా వేసి పెడితే, అన్నీ పాపం

అలవాటైన పనిమనుషుల్లా, బూడిదా, చింతపండూ, ఎర్రమట్టి వేసి బరబరా చకచకా తోమేసింది. ఆ రోజుల్లో విమ్, సర్ఫ్‌లాంటివి కూడా లేవాయె. ఇంట్లో ఒక్కడే గొడుగొయ్యిలా, పెళ్ళాం అయినా లేకుండా వున్న జమిదారుగారి ఇంట్లో ఇన్ని అంట్ల గిన్నెలు ఎందుకొచ్చాయి? ఇంత పెద్ద డెగిసాలూ.. బాండీలూ.. గంగాళాలూ ఎందుకు పడ్డాయి? అని నౌకరు రామయ్యని అడగాలి అనైనా తోచని అమాయకపు ఆడపిల్ల పాపం సరోజ. ఇంక తోమేసాకా, మొహానికి పట్టిన చెమట, పైట కొంగుతో తుడుచుకుంటూ, ఆ చేతికున్న అంట్ల గిన్నెల మసి మొహానికి అంటించుకున్న సరోజ, మొగుడి కోరిక తీరబోతోంది.అయ్యగారు డబ్బులు యిస్తే, గారెలు వండిపెట్టచ్చు. అని ఆనందంగా ఆయన వున్న దగ్గరకి వెళ్ళింది.

"బాబుగారూ" అంది . తీరా వెళ్తే అక్కడ పేపర్ చదువుతున్న పెద్దాయన, పేపర్లోంచి తలెత్తితే ఇంకేవుంది? తనని వాళ్ళ అబ్బాయి కోసం పెళ్ళి సంబంధం మాట్లాడటానికొచ్చిన పెద్దాయన. " నువ్వు గుండమ్మ కూతురివి కదూ?" అన్నాడు. పాత చీరలో మట్టిగాజులతో, మూర్తీభవించిన పేదరికంలా వున్న సరోజని చూసాడు.

సరోజ అప్పటికే సగం చచ్చిపోయింది సిగ్గుతో. అయినా భర్త కోరిక తీర్చాలిగా గొంతు పెగల్చుకుని, బలవంతంగా దుఃఖం ఆపుకుంటూ  చూసింది.

ఆమె సిగ్గుతో తల వాల్చుకుంది. "ఏం కావాలి?" అన్నాడు "అంట్లు తోమేసా" అంది. "అయితే కాసిని నూకలు కొలిపించుకుని వెళ్ళు" అన్నాడాయన.

అసలు పొగరూ... గర్వం.. ఇవన్నీ ఎవరికి? గుండమ్మకా ఈయనకా? ఒకవేళ గుండమ్మకే అనుకుంటే గుండమ్మకి కదా పనిష్మెంట్ ఇవ్వాలి? సరోజకి పనిష్మెంట్ ఇస్తే గుండమ్మ చూసిందా? గుండమ్మకి అక్కడ విధి రాజనాల రూపంలో శిక్ష వేసింది కదా! ఛాయాదేవికి పెత్తనం ఇచ్చి, స్వంత కొంపలో చీకటి కొట్లో బంధించారు కదా!

సరే సరోజ "డబ్బులు కావాలి గింజలొద్దు" అంది.

"ఎందుకు? అన్నాడాయన.

"మా ఆయనకి గారెలు తినాలనుంది" అంది. ఎంతలోకం తెలీని వెర్రిబాగుల ఇల్లాలండీ? కడుపు నెప్పి డాక్టర్ దగ్గరకి వెళ్ళాలి అనో, మొగుడికి కాలు విరిగిందనో, ఏదో అబద్ధం చెప్పచ్చుగా. మా డ్రైవర్ నెలకోసారో రెండు సార్లో లేని తాతని చంపుతూనే వుంటాడు. ఊరికెళ్ళడానికి డబ్బులు కావాలన్నప్పుడల్లా.

సరోజకి అబద్ధం ఆడడం రాదు. అసలు సరోజ ఏ తప్పూ చెయ్యలేదు. సినిమా ప్రారంభంలో "అమ్మా కాఫీ" అని అడగడం తప్పు. ఆ నేరానికే ఇన్ని శిక్షలు.. కానీ ఇప్పటికీ తనివి తీరలేదు దర్శక రచయితలకి "హూ! కూటికి లేకపోయినా మా లావు కోరికలున్నాయే.. గారెలు కావాలా? గారెలు?" అన్నాడు పెద్దాయన.

సరోజకి అభిమానం ముంచుకొచ్చింది. గిర్రున కంట నీరు తిరిగింది. "అవన్నీ మీకు అనవసరం. డబ్బులు ఇప్పించండి" అంది.

ఇక్కడ కార్లమార్క్స్ సిద్ధాంతం ప్రకారం ఆమె శ్రమ శక్తిని నమ్ముకుంది. కష్టపడ్డాక శ్రమదోపిడికీ ఈ వ్యవస్థలో కాపిటలిజానికీ తల వంచదు. మొక్కవోని ధైర్యంతో శ్రామికురాలుగా తన హక్కు తను అడిగింది.

ఆ పెద్దాయన ఆమె మనసు మీదకి ఆఖరి బాణం సంధించాడు "పాపం! మా అబ్బాయినే చేసుకుని వుంటే నువ్వు" అన్నాడు.

సున్నితమైన సరోజ మనసు ఆ బాణం దెబ్బకు విలవిలలాడింది. "బాబూగారూ .. మాటలు మీరకండి. ఆ డబ్బులేవో మీరే వుంచుకోండి" అని ఏడుస్తూ అభిమానంతో, కళ్ళు తుడుచుకుంటూ వీధిన పడింది.

శోకదేవతలా, మాసిన చీరతో, రేగిన తలతో, తెల్లారు ఝామునే లేచి వడ్లు దంచే అక్క సావిత్రి, ఒంటెడు నగలతో, భారీ జరి చీరలో, పడవంత కార్లో ఎదురుపడి, తనని చూసి, కారాపి దిగి "సరోజా" అని పరిగెత్తుకొస్తే, "అక్కా" అంటూ ఏడుస్తూ ఆలంబన దొరికినట్లు అల్లుకు పోయింది సరోజ. "ఈ నగలు..చీరలూ ఎక్కడివే? ఆ బండోడిని పెళ్ళాడావుగా? వాడికింతడబ్బుందా?" లాంటి ఆరాలు తియ్యలేదు పిచ్చిపిల్ల.

"అక్కా.. వెళ్ళి పోదాం రా . వీళ్ళు మంచి వాళ్ళు కారు" అంది. ఎంత వెర్రిదో కదా!

"తప్పమ్మా అలా అనకూడదు. ఆయన మన మామగారు" అంది లక్ష్మి.

అప్పుడూ తప్పు మన సరోజదే. అవమానించిన పెద్దాయనది కాదనమాట.

సరోజ ఆనందంగా వెంటనే కళ్ళు తుడిచేసుకుంది.

"ఏం బుల్లెమ్మా?" అన్న బావగారి ఎక్కెసక్కానికి, వెంటనే ముసి ముసి నవ్వులు నవ్వేసింది.

"నేనేం తప్పు చేసాను? ఇంత ఆస్తి వుండి మొగుడికి నాకీ ఖర్మ ఏమిటి? ఈ మాసినచీర, పూరిల్లు, మొగుడూ తాగుబోతు, దొంగ అనే మనస్తాపం ఏవిటి?" అని అడగలేదు.

అడిగితే లక్ష్మి చెప్పేది నిట్టూర్చి "నువ్వు చేసిన పాపం అల్లా మొదటి సీనులో "అమ్మా కాఫీ" అని అడగడమేనమ్మా" అని.

(అనేక క్షమార్పణలతో దర్శక బ్రహ్మ కమలాకర కామేశ్వరరావుగారికి .. హాస్యానికి రాసిన వ్యాసం)

అదీ 'గుండమ్మ కథ '


ఆనాటికీ ఈనాటికీ అజరామరమైన అద్భుత చిత్రం. ఎన్నిసార్లు చూసినా తనివి తీరదు. ప్రతిపాత్రా అలా సజీవంగా గుర్తుండిపోయి చక్కిలిగిలిపెట్టి నవ్వించే గొప్ప చిత్రం గుండమ్మ కథ.

Post your comments










https://www.youtube.com/watch?v=ERaaX_IulS4